శ్రీమతే రామానుజాయ నమః



కిడాంబి ఆచ్చాన్ వైభవము

(భగవద్రామానుజులు నియమించిన 74 మంది సింహాసనాధిపతులలో
ఒకరైన కిడాంబి ఆచ్చాన్ వైభవాన్ని తెలిపే లఘు గ్రంథం)

శ్రీమాన్ డా॥ ఈ.ఎ. శింగరాచార్యులు

కీర్తిమూర్తులు, వాచస్పతి, ఉ.వే. శ్రీమాన్
డా॥ కిడాంబి శ్రీనివాస రామానుజాచార్యస్వామివారి
పవిత్రస్మృతిజ్ఞాపిక

2011

కిడాంబి ఆచ్చాన్ వైభవం

శ్రీమాన్ డా॥ ఈ.ఏ. శింగరాచార్యులు

అన్ని హక్కులు రచయితవే

ప్రకాశనము : మార్చి, 2011

ప్రతులు : 500

వెల : రు. 15/-

సందర్భము : ఉభయవేదాంత సభలు, నరసాపురం

ముఖచిత్రం : కిడాంబి ఆచ్చాన్, తిరువహీంద్రపురం

వేదిక : టి.టి.డి. కళ్యాణమండపము, నర్సాపురం

**ఈ గ్రంథం శ్రీమతి సరోజిని శ్రీమాన్ తాతా వేంకటస్వామి,
దంపతులు (ఒంగోలు) భక్తితో
సమర్పించిన పవిత్రద్రవ్యంతో ముద్రింపబడినది.**

ప్రతులకు :

**1) శ్రీమాన్ తాతా వేంకటస్వామి,
తాతా ఆంజనేయులు శెట్టి & సన్స్,
గాంధీరోడ్, ఒంగోలు-1. ఫోన్ : 9248429290.**

**2) శ్రీమాన్ కె.టి.రామానుజాచార్యులు, వానమామలై మఠం,
మూలాపేట, నెల్లూరు. ఫోన్ : 0861-2313616.**

**అక్షరయోజనము : శ్రీమతి జయలక్ష్మి, తిరుపతి.
శ్రీచంద్రశేఖర్, తిరుపతి.**

ముద్రణ : సి.యన్. ప్రింటర్స్, తిరుపతి.

మంగళాశాసనం

భగవద్రామానుజులకు సమకాలీనులైన కిడాంబి ఆచ్చాన్ ఆ మహాచార్యులకు సాక్షాత్ శిష్యులు. వీరు 74 మంది సింహాసనాధిపతులలో ఒకరు. శ్రీరామానుజుల తిరుమేని రక్షణలో వీరికి గల ప్రావణ్యం నిరుపమానం. ఈ ఆచార్య వర్యులకు సంబంధించిన విశేషాలు, వివరాలు చాలా స్వల్పంగానే మనకు లభిస్తున్నాయి. గురుపరంపరా ప్రభావం, యతిరాజవైభవం, దివ్యసూరిచరితం, ప్రపన్నామృతం మొదలైన సంప్రదాయచరిత్రగ్రంథాలలో, దివ్యప్రబంధవ్యాఖ్యానాలలో, వార్తామాలైలో కనిపించే విశేషాలను బట్టి వీరు గొప్ప ఆత్మగుణసంపన్నులని, వేదాంత శాస్త్రంలో అగాధమైన పాండిత్యాన్ని కలవారని, కార్యనిర్వహణ దక్షులని, నిరాడంబరమైన వ్యక్తిత్వాన్ని కలవారని, దివ్యదేశాలపట్ల అమితమైన ప్రావణ్యాన్ని కలవారని, అనుష్ఠానవిధి - ఈ విధంగా కొన్ని విశేషాలు తెలుస్తున్నవి. వీరికి సంబం ధించి లభించిన వివరాలను ఒకచోట చేర్చి అనుసంధించినప్పుడు వీరి విశిష్టమైన వ్యక్తిత్వాన్ని కొంతవరకు అభ్యూహించే అవకాశం ఉన్నది. ఇటువంటి ప్రయత్నమే ప్రస్తుతం ప్రచురించ బడుతున్న, కిడాంబి ఆచ్చాన్ వైభవం. పూర్వాచార్యులందరి యొక్క వైభవాలను తెలిపే ఇటువంటి లఘు కృతులు. ముద్రింపబడ వలసిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నది.

దీనిని ముద్రించడానికి ఆవశ్యకమైన ఆర్థిక భారాన్ని వహించడానికి ఒంగోలు వాస్తవ్యులు, భగవద్భాగవతాచార్య కైంకర్య నిష్ఠులు, శ్రీమతి సరోజిని, శ్రీమాన్ తాతా వేంకట స్వామి దంపతులు ముందుకు రావడం వారి సంప్రదాయ ప్రచార శ్రద్ధను తెలియజేస్తున్నది. ఈ గ్రంథాన్ని వీరు తమకు ఉత్తారకాచార్యులైన **వాచస్పతి, ఉ.వే. శ్రీమాన్ డా॥ కె.ఎస్. రామానుజాచార్య స్వామి**వారి పవిత్ర భవ్యస్మృతిగా ముద్రించడం మిక్కిలి అభినందనీయం. 2011, మార్చి 25, 26, 27 తేదీలలో నరసాపురంలో ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్ట్, తి.తి.దే. వారి నిర్వహణలో జరిగే ఉభయవేదాంత పండిత సభలలో ఈ గ్రంథం ఆవిష్కరింపబడడంకూడా చాలా సముచితం. వీరిని తీర్చిదిద్ది, ఈ విషయంలో ప్రోత్సహించిన సహృదయులు, **ఉ.వే. శ్రీమాన్ కిడాంబి భక్తవత్సలన్ స్వామి**వారికి (ఒంగోలు) హార్దంగా కృతజ్ఞతలను నివేదించుకుంటున్నాను. **శ్రీమతి సరోజి, శ్రీమాన్ తాతా వేంకటస్వామిని** దంపతులకు అనేక మంగళాశాసనాలను చేస్తున్నాను. కిడాంబి ఆచ్చాన్‌కు సంబంధించిన వివరాలను సేకరించడంలో తోడ్పడిన **శ్రీమాన్ ఎం.ఎస్. వేంకటాచార్య స్వామివారికి (కాట్టుమన్నార్ కోయిల్) శ్రీమాన్ కె.కె. పరకాలన్ స్వామివారికి** కృతజ్ఞతా పూర్వకంగా ప్రణమిల్లుతున్నాను.

ఇట్లు

తిరుపతి — విన్నవించు భాగవత విధేయుడు

9-3-2011 — **ఈ.ఏ. శింగరాచార్యులు**

కిడాంబి ఆచ్చాన్ వైభవం

అవతారిక

లక్ష్మీనాథాఖ్యసింధౌ శఠరిపుజలదః ప్రాప్య కారుణ్యనీరం
నాథాద్రావభ్యషించత్ తదను రఘువరాంభోజచక్షుర్ద్వరాభ్యామ్ ।
గత్వా తాం యామునాఖ్యాం సరితమథ యతీంద్రాఖ్యపద్మాకరేంద్రం
సంపూర్ణప్రాణిసస్యే ప్రవహతి బహుధా దేశికేంద్రప్రమౌఘైః ॥

(శ్రియఃపతి అనే మహాసముద్రంలో నమ్మాళ్వార్లు అనే మేఘం కరుణ అనే నీటిని పానం చేసి, నాథముని అనబడే కొండపై వర్షించింది. ఆ నీరు పుండరీకాక్షులనబడే ఉయ్యక్కొణ్డార్, శ్రీరామమిశ్రులనబడే మణక్కాల్‌నమ్బి- అనే ఇద్దరు ఆచార్యుల రూపంలోని వాగులద్వారా శ్రీయామునులనే గొప్ప నదికి చేరింది. ఆ నదినుండి పెరియనంబి, తిరుక్కోట్టియూర్ నంబి, పెరియ తిరుమల నంబి, తిరువరంగ పెరుమాళ్ అరైయర్, తిరుమాలై ఆణ్డాన్ - అనే అయిదుగురు ఆచార్యుల రూపంలోని కాలువలద్వారా భగవద్రామానుజులు అనే తామరకొలను లోకి చేరి, అక్కడనుండి డెబ్భైనాల్గు ఆచార్యపురుషులనే పిల్లకాలువలద్వారా ప్రాణులనే సస్యాలను చేరుతున్నది)

ఈ శ్లోకం భగవద్రామానుజుల శిష్యపరంపరలో ప్రముఖులైన గోవిందభట్టర్ అనబడే ఎమ్బార్ అనుగ్రహింపబడింది. ఈశ్లోకంలో **"లక్ష్మీనాథ** సమారంభమై, నాథయామునమధ్యమై, డెబ్భైనాల్గు సింహాసనాధిపతులవరకు గల గురుపరంపరను గూర్చి ప్రస్తావింపబడింది. శ్రీరామానుజులు ఏడువందలమంది యతులతో, 74 మంది సింహాసనాధిపతులతో ఇంకా లెక్కలేనంతమంది విష్ణుభక్తులతో సేవింపబడేవారై శ్రీరంగంలో వేంచేసి ఉన్న విషయాన్ని గురుపరంపరాప్రభావంలోని ఈక్రింది శ్లోకం తెలుపుతున్నది.

సంసేవిత స్సంయమిసప్తశత్యా
పీఠై శ్చతుస్సప్తతిభి స్సమేతమ్ ।
అన్యైశ్చ తైస్తైరపి విష్ణుభక్తైః
ఆస్తేఽధిరంగం యతిసార్వభౌమః ॥

భగవద్రామానుజుల శ్రీచరణాలను ఆశ్రయించిన ఆచార్యుల వివరాన్ని గురుపరంపరాప్రభావాది సంప్రదాయచరిత్రగ్రంథాలు తెల్పుతున్నవి. ఈ వివరంలో

74 మంది గురుపరంపరకు చేరిన పెద్దల తిరునామాలు కన్పడుతున్నాయి. వాటిలో 24 తిరునామం కిడాంబి ఆచ్చాన్, 73వ తిరునామం కిడాంబి పెరుమాళ్. భగవద్రామానుజుల అవతార స్థలంలోని ఒకే మండపంలో ఈ ఇద్దరు ఆచార్యుల అర్చారూపాలను సేవించవచ్చు. తిరువహీంద్రపురం అనే దివ్యక్షేత్రంలో కాట్టు మన్నార్ కోయిల్‌లో కిడాంబి ఆచ్చాన్ సన్నిధి ఉన్నది. అక్కడ వారి అర్చామూర్తి సాక్షాత్కరిస్తున్నది.

రామానుజార్యశ్రుతిమౌళి భాష్యమ్ అర్థం రహస్యం ద్రమిడశ్రుతీనామ్ ।
సంప్రాప్య తేనైవ గురూకృతాంస్తాన్ భజే చతుస్సప్తతిపీఠసంస్థాన్ ॥

అనే ఈ శ్లోకం 74 మంది సింహాసనాధిపతులకు చెందిన తనియన్ శ్లోకం. ఈ సింహాసనాధిపతులలో ఒకరైన కిడాంబి ఆచ్చాన్ వైభవం సంగ్రహంగా విన్నపింపబడుతున్నది.

"నగరీణాం చ సర్వేషాం పురీ కాంచీ విశిష్యతే, గిరీణాం చాపి సర్వేషాం శ్రేష్ఠో హస్తిగిరిః స్మృతః" అనే రీతిలో నగరాలలో శ్రేష్ఠమైన కాంచీనగరంలో వినుతికెక్కిన హస్తిగిరిక్షేత్రంలో కిడాంబి ఆచ్చాన్ అవతరించారు. వీరు చండాంశులనే దివ్యసూరుల అంశతో జన్మించారని, కలియుగాది 4059 సంవత్సరాల తరువాత హేవిళంబి నామసంవత్సరం చైత్రమాసం శుక్రవారంలో అవతరించారని, శ్రీరంగం వీరి జన్మస్థలమని అభిధాన చింతామణి అనే గ్రంథంలో తెలుపబడింది. వీరి జన్మనక్షత్రం హస్త. వీరి తిరునామంలో **"కచ్చిక్కడామ్బు"** అని ఉన్నందువల్ల వీరి జన్మస్థలం కాంచీపురమని భావించడమే యుక్తమని, వీరి తల్లిగారి ఊరు శ్రీరంగమై ఉండి ఉండవచ్చునని సుప్రసిద్ధ తమిళవిద్వాంసులు, పరిశోధకులు **శ్రీమాన్ ఎం.ఎస్. వేంకటాచార్యస్వామివారు** (కాట్టుమన్నార్‌కోయిల్) అభిప్రాయపడ్డారు. వీరి తల్లిదండ్రులకు వీరు రెండవ కుమారులని, వీరి అగ్రజుల పేరు విష్ణ్వాచార్యులని వీరి తనియన్ శ్లోకంవల్ల తెలుస్తున్నది. వీరు ఆత్రేయగోత్రులు, ఆపస్తంబసూత్రులు, యజుశ్శాఖీయులు. **"కిడాంబి ఆచ్చాన్"** అనే పేరు. **"కడామ్బు, ఆచ్చాన్"** అనే పదాలకు మాఱు రూపం. **"కడామ్బు"** అనే పదం **"ఘటామ్బు"** శబ్దభవం. ఘటమంటే కుండ. అమ్బు అంటే తీర్థం. దీనినిబట్టి వీరు భగవానునకు తీర్థక్రైంకర్యం చేసేవారి కుటుంబంలో అవతరించారని తెలుస్తున్నదని శ్రీమాన్ వేంకటాచార్య స్వామివారి అభిప్రాయం. **"ఆచ్చాన్"** అనే పదం **"ఆశాన్"** (ఆచార్యన్) అనేపదం

యొక్క వికృతి. శ్రీరంగంలోకూడా ఈవిధంగా తీర్థకైంకర్యాన్ని చేసేవారున్నారు. కాంచీపురంలో వరదరాజస్వామికి తిరువీథి ఉత్సవం జరిగే సందర్భంలో స్వామికి ముందుగా తీర్థకలశాన్ని తీసికొని ఒకరు వెళ్ళే సంప్రదాయం ఉన్నది. ఈవిధమైన కైంకర్యాన్ని చేసేవారు శఠమర్షణగోత్రానికి చెందిన తాతాచార్యులవారి గుమాస్తా. తిరుమలలో తీర్థకైంకర్యాన్ని నిర్వహించిన పెరియతిరుమలనంబి శఠమర్షణ గోత్రీయులే. తన మేనత్తకు భర్త అయిన పెరియతిరుమల నంబికి సహాయంగా తిరుమలలో తీర్థకైంకర్యానికి చేసినందువల్లకూడా ఈ పేరును ఆచ్చాన్ పొంది ఉండవచ్చు - అని శ్రీమాన్ ఎం.ఎస్. వేంకటాచార్యస్వామివారి అభిప్రాయం. కిడాంబి ఆచ్చాన్ కాలం క్రీ.శ. 1056 నుండి 1058 వరకు అని, కనుక వీరు 102 (సుమారు) ఏండ్లు జీవించారని ద్రావిడసాహిత్యపరిశోధకులు శ్రీ **ఎం. అరుణాచలం** తెలిపారు.

కిడాంబి ఆచ్చాన్ సహజనామం ప్రణతార్తి హరులు. ఈనామం కంచిలోని వరదరాజస్వామిని తెలుపుతున్నది కనుక, ఆచ్చాన్ కాంచీనగరానికి చెందినవారని నిశ్చయించవచ్చునని శ్రీమాన్ వేంకటాచార్యస్వామివారు తెలిపారు. గురుపరంపరా ప్రభావంలో కిడాంబి పెరుమాళ్, కిడాంబి ఆచ్చాన్ శ్రీరామానుజుల మడప్పళ్ళి (మహానస) కైంకర్యాన్ని నిర్వహించేవారని తెలుపబడింది.

పెరియతిరుమలై నంబి ఆచ్చాన్‌కు మేనత్త భర్త - అని వడుగనంబి రచించిన యతిరాజవైభవంలోని **"తతస్తదాత్రేయనతార్తిహర్తా యతీశపాదాంబు రుహం ప్రపన్నః, పిళ్ళానభిఖ్యం స్వపితృష్వసుశ్చ శ్రీశైలపూర్ణస్య సుతం నివేద్య"** (65) అనే శ్లోకం ద్వారా తెలుస్తున్నది. పెరియతిరుమలనంబి నియమనానుసారం కిడాంబి ఆచ్చాన్ భగవద్రామానుజులు ఆశ్రయించారని కూడా పైశ్లోకం తెలుపు తున్నది.

"తేశారుమ్ శిచ్చన్" కిడాంబి ఆచ్చాన్

భగవద్రామానుజులకు ఆచ్చాన్ మహానసకైంకర్యాన్ని చేయడానికి గల కారణభూతమైన వృత్తాంతం ఆఱాయిరప్పడి గురుపరంపరా ప్రభావంలో ఈ విధంగా తెలుపబడింది.

ఉడైయవర్ గద్యత్రయాన్ని, నిత్యతిరువారాధన క్రమాన్ని అనుగ్రహించి, 'పరబ్రహ్మ శ్రీమన్నారాయణుడే" అని నిశ్చయించి, శ్రీరంగంలో దర్శననిర్వాహాన్ని చేస్తున్న కాలంలో ఒకనాడు శ్రీరామానుజులు ఏడు ఇళ్ళకు మధుకరం (భిక్షకోసం)

వెళ్ళినపుడు, వారిపై ఉండే ద్వేషంతో ఒక ఇంటి యజమాని విషం కలిపిన అన్నాన్ని భిక్షగా పెట్టవలసినదని తన భార్యను నిర్బంధించాడు. ఆ గృహిణి మొదట అంగీకరించకపోయినా, చివరకు భర్త చేసిన బలవంతంవల్ల విషాన్నాన్ని భిక్షగా సమర్పించి, దండం సమర్పించి వెళ్ళిపోయింది. (భిక్ష సమర్పించిన తరువాత నమస్కరించరాదనే నియమాన్ని దాటి తనకు ఆమె నమస్కరించడంచేత) "ఇదేమి?" అని ఆశ్చర్యపడిన శ్రీరామానుజులు ఆమె మనస్సులోని భావాన్ని గుర్తించి, ఆ విషాన్నాన్ని కావేరీనదిలో కలిపివేసి, ఆనాటినుండి మూడు దినాలు ఉపవాసం చేశారు. ఈ సంగతిని తిరుక్కోట్టియూర్‌నంబి విని, శ్రీరంగానికి బయలుదేరారు. వారి రాకను గూర్చి తెలిసిన శ్రీరామానుజులు శిష్యసమేతులై వారికి ఎదురువచ్చారు. కావేరీనదీతీరంలో తిరుక్కోట్టియూర్ నంబిని చూచి వారి పాదాలపై పడి శ్రీరామానుజులు సాష్టాంగదండ ప్రణామాన్ని చేశారు. మధ్యాహ్న సమయం మండుటెండలో చాలా వేడిగా ఉండే నదీతీరంలోని ఇసుకపై సాష్టాంగ పడిన శ్రీరామానుజులను చూచినా తిరుక్కోట్టియూర్‌నంబి వారిని పైకి లెమ్మని అనలేదు. శ్రీరామానుజులు పైకి లేవలేదు. ప్రక్కనే ఉన్న కిడాంబి ఆచ్చాన్ తమ ఆచార్యులైన శ్రీరామానుజుల సుకుమారమైన దేహం ఎండవల్ల, ఇసుకవేడి పొందే బాధను చూచి సహించలేకపోయారు. "ఇదేమి శిష్యాచార్యక్రమం! సుకుమారమైన పూదండను ఎండలో ఎవరైనా పారవేస్తారా!" అని అంటూ తాము ఇసుకపై పరుండి శ్రీరామానుజులను తమపై ఉండేటట్లు చేసికొన్నారు. దీనిని చూచిన నమ్బి "మీకోసమేసుమా నేను వెదకుతున్నాను. శ్రీరామానుజుల దివ్యమంగళ విగ్రహ రక్షణలో శ్రద్ధను కలవారు మీరు. ఈనాటినుండి శ్రీరామానుజులకు ప్రసాదాన్ని వండి సమర్పించే బాధ్యత మీది" అని ఆజ్ఞాపించారు. ఆనాటి నుండి ఆచ్చాన్ ఆ కైంకర్యాన్ని భక్తిశ్రద్ధలతో నిత్యం నిర్వర్తించారు. ఈ వృత్తాంతాన్ని వడుగనంబి యతిరాజవైభవంలో - **"తతః కదాచిత్ విషయుక్తభిక్షాం జ్ఞాత్వా యతీశ స్త్రిదినోపవాసః, నిశమ్య తత్ ద్వాపి పూర్ణవర్యా గోష్ఠీపురాదాపతురాశు రంగమ్, ప్రత్యుద్గతం తం ప్రణతం యతీశం త్వద్దేహమానీ ప్రణతార్తి హర్తా సంశోధితాం స్వీకురు నిత్యభిక్షా మిత్యూచతు స్తౌ స తథాఽకరోచ్చ"** అని తెలుపబడింది.

ప్రపన్నామృతంలో - **"అర్చకానాం తథా తేషాం ప్రధానః పురుషాధమః, హింసితుం లక్ష్మణాచార్య ముద్యుక్తః కశ్చిదర్చకః, విత్తేన స్వవశం కృత్వా ద్విజం కంచిద్దినాతురమ్, విషాన్నం లక్ష్మణార్యాయ దీయతా మితి సోఽబ్రవీత్, సోఽంగీకృత్య వచ స్తస్య భార్యా మాహూయ చాబ్రవీత్, విషాన్నం లక్ష్మణార్యాయ ప్రదేయం హి**

త్వయాఽధునా, సా సాధ్వీ తద్వచః శ్రుత్వా మతిం తత్ర న చాఽకరోత్, నిర్భర్త్స్య మానా సా భర్త్రా విషన్నం భర్తృసన్నిధౌ, దత్వా సాధ్వీ యతీంద్రాయ కృత్వా పాదాభివందనమ్, విలేఖ నఖదారాభిః యతీంద్రపదపంకజమ్, ఇంగితజ్ఞోమనో జ్ఞాత్వా దృష్టాఽశ్రునయనం స్త్రియాఃు, శునే తదన్నమదిశత్ సోఽపి జగ్ధ్వా క్షయం గతః, మృతం శ్వానం తదా దృష్ట్వా హిత్వా భిక్షాశనం సుధీః, రామానుజస్తదా తస్థౌ పీత్వా త్రీనుదకాంజలీన్, గోష్ఠీపూర్ణస్తతస్తస్య వృత్తాంతం యతిభూపతేః, శ్రుత్వా రంగం ప్రతియయౌ కృపయా శిష్యవత్సలః, తచ్ఛ్రుత్వా లక్ష్మణాచార్యః స్వాచార్యా గమనం తదా, రంగదక్షిణకావేర్యాం స్వశిష్యజనసంవృతః, అభిచక్రామ సహసా గోష్ఠీపూర్ణం యతీశ్వరః, ఘర్మకాలే చ మధ్యాహ్నే కావేర్యాం తప్తసైకతే, ప్రణామం దండవత్తస్య పాదయో స్సహసాఽకరోత్, జ్ఞాతు మిచ్ఛన్ స తన్మైత్రం తముత్తిష్ఠేతి నావదత్, ప్రణతార్తిహరః కశ్చిత్ ఆత్రేయాన్వయభూషణః, తీక్ష్ణాంశుతిగ్మకిరణైః ప్రతప్తం సైకతే గురుమ్, అసహిష్ణుర్విలోక్యాశు గోష్ఠీపూర్ణ మభాషత, కిమాగతోఽస్యముం హంతుం మద్గురుం చోళయాధునా, తతోఽసహిష్ణుర్మహతా ప్రేమ్ణా తం యతి పుంగవమ్, ఉద్ధృత్య తస్థౌ తదంతః తప్తసైకతే, తదాకర్ణ్య తముద్వీక్ష్య తముత్థాప్య కృతాదరః, యతీంద్రపాణిం సంగృహ్య గోష్ఠీపూర్ణోభ్యఽభాషత, అనేన కారయిత్వా త్వం పాకం లక్ష్మణదేశిక, భోజనం కురు యోగీంద్ర వైష్ణవేన దయాళునా, గోష్ఠీపూర్ణాజ్ఞయా ధీమాన్ యతీంద్ర స్స తథాఽకరోత్" అని తెలుపబడింది.

ఈ వృత్తాంతాన్ని బట్టి తమ ఆచార్యులైన భగద్రామానుజుల దివ్యమంగళ విగ్రహరక్షణ విషయంలో ఆచ్చాన్‌కు గల శ్రద్ధ వ్యక్తమౌతున్నది. **"తేశారుమ్ శిచ్చన్ అవన్ శీర్‌వడివై"** అని శ్రీ వరవరమునులు సచ్ఛిష్యుడు ఆచార్యుని దేహరక్షణకై పాటుపడాలని అన్నారు కదా!

బహుశ్రుతులు ఆచ్చాన్

వఙ్గిపురత్తు ఆచ్చి కిడాంబి ఆచ్చాన్‌కు పల్కిన వార్త ఇది :- **(వార్తామాలై - గ్రంథంలోని 110వ వార్త)**

భగవచ్ఛేషమై, అనాదికాలం భగవానునితో సంబంధాన్ని తెంచుకొన్న జంతువుకు (బద్ధజీవునకు) భగవానుని శ్రీచరణాల సన్నిధికి చేర్చించి, ఉజ్జీవింప జేయడానికి పిరాట్టి ఉన్నది- అని విశ్వసించు- అని వఙ్గిపురత్తు ఆచ్చి కిడాంబి ఆచ్చాన్‌తో పలికారు. దీనివల్ల ఆచ్చాన్‌యొక్క బహుశ్రుతత్వం తెలుస్తుంది.

శ్రీరామానుజుల పరిపూర్ణమైన ఆదరానికి పాత్రం ఆచ్చాన్

(యామ్ వన్ద కారియమ్ ఆరాయ్న్దు అరుళ్) అ౬కర్ కిడాంబి యాచ్చానై అరుళ్‌పాడిట్టు **"ఒన్ను శొల్లి క్కాణాయ్"** ఎన్న, **"అపరాధసహస్రభాజనమ్"** ఎన్ను తొడఙ్గి **"అగతిమ్"** ఎన్న, **"నమ్మిరామానుజశనై యుడైయైయాయిరున్నువైత్తు "అగతిమ్" ఎన్నప్పెఱాయ్! ఎన్ఱరుళిచ్చెయ్దార్"** - అ౬కర్ (సుందరబాహుస్వామి) ఆచ్చాన్ ఆహ్వానించి అనుగ్రహించి- "ఏదైనా ఒక మాటను చెప్పు'' అని అనగా, ఆచ్చాన్ ఆళవందార్ స్తోత్రంలోని **"అపరాధసహస్రభాజనమ్"** అనే శ్లోకాన్ని ఆరంభించి, **"అగతిమ్"** అనే పర్యంతం అనుసంధించారు. అపుడు అ౬కర్ "మన శ్రీరామానుజులను గతిగా కల్గిన మీరు **"అగతిమ్"** అని అంటున్నారే'' - అని అన్నాడు. ఈ ఐతిహ్యం తిరుప్పావై లోని 23వ పాశురానికి గల మూవాయిరప్పడి, నాలాయిరప్పడి, ఈరాయిరప్పడి వ్యాఖ్యానాలలో ఉన్నది.

దీనినిబట్టి ఆచ్చాన్ విషయంలో శ్రీరామానుజులకు గల ఆదరం వ్యక్తమవు తున్నది.

ఆచ్చాన్ పూర్ణమైన దివ్యప్రబంధావగాహం.

ఈ సందర్భం నాచ్చియార్ తిరుమొ౬ి- **9-8 (కాలై ఎ౬ున్దిరున్దు)** అనే పాశురవ్యాఖ్యలో కనిపిస్తున్నది.

ఆచ్చాన్ పణిత్తాక జీయర్ అరుళిచ్చెయ్యుమ్బడి - "ఇవళ్ పిఱన్ద ఊరిల్ తిర్యక్కుకళుక్కుత్తాన్ వేఱు పోదుపోక్కు ఉణ్డో ? కణ్ణుఱక్కన్దాన్ ఉణ్డో ! ఎన్ఱు" ఈ గోదాదేవి అవతరించిన ఊరిలో తిర్యక్కులకు సైతం భగవానునిగూర్చిన వార్తలను పల్కడం తప్ప ఇంకొక కాలక్షేపం ఉన్నదా ? నిద్ర ఉన్నదా ? అని ఆచ్చాన్ పల్కినట్లు నఞ్జీయర్ అనుగ్రహించారు. (ఇక్కడ **"ఆచ్చాన్"** అని నిర్దేశింప బడినవారు శిఱియాచ్చాన్- అని కూడా చెప్పవచ్చు అని కొందఱి భావన.)

పరకాలనాయకి తల్లి పలికే రీతిలో **(పెరియతిరుమొ౬ి -3-7-3)** తిరుమఙ్గై ఆ౬్వార్లు అనుగ్రహించిన పాశురాన్ని వ్యాఖ్యానిస్తూ పెరియవాచ్చాన్‌పిళ్ళై ప్రస్తావించిన ఐతిహ్యం ఇది.

పరకాలనాయకిని భగవానుడు పిలుచుకొని పోయిన విషయాన్ని తలచి ఆమె తల్లి బాధపడుతూ పలికే ఈ దశకంలో - **"అఞ్జువన్ వెళ్ళోల్ నఙ్గాయ్ ! అరక్కర్‌కులప్పావై తన్నై వెళ్ళినై మూక్కరిన్ద విఱలోన్‌తిఱమ్ కేట్కిల్"** (రాక్షసుల

కులకాంత అయిన శూర్పణఖయొక్క ముక్కు చెవులను కోసిన భగవానుని రీతిని స్మరించి భయపడుతున్నాను) అని పరకాలనాయకి తల్లి పల్కినట్లుండే ఈ పాశురంలోని అర్థాన్ని గ్రహించడంలో ఏర్పడిన సందేహాన్ని గూర్చి వ్యాఖ్యాత ప్రస్తావించిన ఐతిహ్యం ఇది.

"భట్టర్ ఇప్పాట్టై అరుళిచ్చెయ్తు- ఒరు స్త్రీయై విరూపై ఆక్కినవనుడైయ తిఱమ్ కేట్కిల్, అళ్ళవన్ - ఎన్నైయాలే ఇత్తలైక్కు కుణహీనమై త్తోన్ఱినిట్టతు. ఇతు ఆళ్వార్ అరుళిచ్చెయ్యక్కూడాతతు. ఇతు ఎజ్గనే శేరుమ్బడి ? ఎన్ఱ ఆచ్చాయి క్కేట్క, "తుడిప్పిరుక్క క్రై వేకవేణుమో? ఎమ్బెరుమానార్ తామే అరుళిచ్చెయ్తు వైత్తారిత్తే" ఎన్న, "అరుళిచ్చెయ్తపడి ఎజ్గనే ?" ఎన్ఱ కేట్క, "మున్బొరు పుణర్న్దు ఉడన్ పోక్కిలే పిఱన్ద ప్రమాదత్తై కేట్ట అత్తై నినైత్తు ఇప్పోతు పయప్పడుకిన్ఱాళ్" ఎన్ఱరుళిచ్చెయ్దార్" (ఈ పాశురాన్ని ఒక సారి పల్కిన భట్టర్, "నా కుమార్తెను పిలుచుకొని పోయిన నాయకుడు పూర్వం ఒకానొక పర్యాయం రక్కసి ముక్కు చెవులను కోసినవాడని తెలిసి నేను భయపడుతున్నాను" అని తల్లి పల్కుతున్నట్లు అర్థాన్ని గ్రహిస్తే, "రాక్షసి ముక్కు ఖండించినట్లే, నాకుమార్తె ముక్కును కూడా అతడు ఖండిస్తాడా!- అని భయపడుతున్నట్లుగాకదా అర్థం తోస్తుంది. ఈవిధంగా పల్కితే సద్గుణసాగరుడైన భగవానుని విషయంలో దోషాన్ని ఆరోపించినట్లే కదా అవుతుంది! అయితే, ఆళ్వార్లు ఈవిధంగా పలుకరుకదా! కనుక ఈ సూక్తిని ఏవిధంగా అన్వయించాలి ?- అని ఆచ్చాన్‌ను (భట్టర్) ప్రశ్నించారు. అపుడు ఆచ్చాన్ "చేతిసంచి ఉండగా చేతిని చాచాలా! ఇంతకుముందే భగవద్రామానుజులు దీనికి సమాధానం అనుగ్రహించినపుడు మనం దీనికోసం శ్రమపడాలా ?" అని అన్నారు. "భగవద్రామానుజులు అనుగ్రహించిన సమాధానం ఏది ?" అని భట్టర్ అనగా, ఆచ్చాన్ ఈ విధంగా సమాధానం ఇచ్చారు. "పూర్వం ఒకానొకసారి శ్రీరాముడు, సీతాదేవి తాను కలసి ఉన్న సమయంలో మధ్యలో అడ్డు వచ్చిన శూర్పణఖ ముక్కుచెవులను ఖండించాడు. రావణుడు సీతను అపహరించాడు. కనుక దివ్యదంపతుల విశ్లేషానికి మూలకారణం - శూర్పణఖ యొక్క ముక్కు చెవులను ఖండించడమే. అందువల్ల "అపుడు ఇద్దరు కలసి ఉన్నపుడు రక్కసికి అంగభంగాన్ని చేసి ఆపదను కొనితెచ్చుకొన్నట్లే, ఇపుడుకూడా కలసి ఉండే నా కుమార్తె, నాయకుడు ఇరువురు మళ్ళీ ఏదయినా శూర్పణకు అంగభంగాన్ని చేయడంవంటి పనిని చేసి ఆపదను కల్గించుకొని, పరస్పరం విశ్లేషిస్తారో! ఏమో!-

అని భయపడుతున్నాను - అని అంటున్నది నాయకి తల్లి" అని శ్రీరామానుజులు వివరించారు- అని ఆచ్చాన్ తెలిపారు.

దీనినిబట్టి ఆచ్చాన్‌యొక్క గురుకులక్లిష్టత్వం నిరూపింపబడింది. పెరియతిరుమలనంబి ఆదేశానుసారం శ్రీరామానుజులను ఆశ్రయించి, వారి సన్నిధిలో సకలార్థాలను ఆచ్చాన్ అధికరించారుకదా! **"తం వీక్ష్య బాలం స తదైవ సర్వమంత్రాన్ సహార్థాన్ ప్రణతార్తిహర్త్రే దిదేశ"** అని వడుగనంబి కూడా ఈ విషయాన్ని యతిరాజవైభవ గ్రంథంలో ప్రస్తావించారు.

ఆచ్చాన్‌యొక్క గాఢమైన భగవద్గుణాభినివేశం

ఈ ఐతిహ్యం తిరువిరుత్తమ్-30వ పాశుర వ్యాఖ్యలో కనిపిస్తున్నది.

నాయకుని చూడాలని బయలుదేరి పోయిన తమ మనస్సు తిరిగి రానందువల్ల ఆ మనస్సువద్దకు పక్షులను దూతగా పంపాలని భావించి, పరాంకుశ నాయకి ఆ పక్షులను ప్రార్థించేటపుడు **"తొళుతు ఇరన్దేన్"** అని అన్నది. "నమస్కరిస్తాను" అనే భావమే సరిపోయి ఉండగా, నమస్కరించడం, ప్రార్థించడం కూడా చేసిందే!- అని అంటూ వ్యాఖ్యాత (భగవానుని విషయంలో) "నమస్కరించాలి" అనే భావమే అధికం -అనే దానికి దృష్టాంతంగా ఒక ఐతిహ్యాన్ని ఈక్రింది విధంగా ప్రస్తావిస్తున్నారు.

"కిడాంబియాచ్చానోడే నమ్బి తిరువళుతివళనాడు దాసరుమ్, మున్ఱుమ్ ముదలికళుమ్ ఇరున్ద, "అన్యత్ పూర్ణాత్" ఎన్గిఱ శ్లోకత్తై కేళానిఱ్క, **"అన్యత్"** ఎన్గిఱతు, **"ఒరుక్కాల్ అమైయు మెన్గిఱతో ?"** ఎన్న, **"అరైక్కాల్ అమైయుమ్"** ఎన్ఱ కిడాంబి ఆచ్చాన్ నియమిత్తాన్.

ఒక పర్యాయం నమ్బి తిరువళుతి వళనాడు దాసర్, ఇంకా కొందఱు కలిసి కిడాంబి ఆచ్చాన్‌వద్ద **"అన్యత్ పూర్ణాత్"** అనే శ్లోకానికి వివరణాన్ని ఆలకిస్తున్నారు. **"అన్యత్ పూర్ణదపాంకుంభాత్ అన్యత్ పాదావనే జనాత్, అన్యత్ కుశలసంప్రశ్నాత్ న చేచ్ఛతి జనార్దనః"** (ఒక పూర్ణకుంభం కంటే వేఱుదేనినీ, శ్రీపాదాలను కడగడంకంటే వేఱుదేనినీ, కుశలాన్ని అడగడం కంటే వేఱుదేనినీ జనార్దనుడైన శ్రీకృష్ణుడు ఆశించడు) అని అంటూ శ్రీకృష్ణునిగూర్చి విదురుడు ధృతరాష్ట్రునితో అన్నాడు ఈశ్లోకం మహాభారత ఉద్యోగపర్వంలో (87-13) ఉన్నది.

"అన్యత్ న చేచ్ఛతి" - మిక్కిలి సులభమైన వీనినికంటే వేఱుదేనినీ శ్రీకృష్ణుడు ఆశించడు- అని శ్లోకంలో చెప్పబడిందికదా! ఇవికూడ ఒక్కసారి

చేసినా చాలును - అని కూడా అతని సౌలభ్యగుణానుగుణంగా అర్థాన్ని గ్రహించ వచ్చునా? - అని కిడాంబి ఆచ్చాన్‌ను అడుగగా, ఆచ్చాన్ "ఒకమారు ఏమి! సగం మారు కూడా చాలు" అని అన్నారట. అంటే- వీటిని ఒక పర్యాయం చేస్తే చాలును- అని కూడా చెప్పనక్కలేదు. చేయాలి- అని మనస్సులో భావించడమే చాలు. ఆవిధంగా భావిస్తే, నిజంగా చేసినట్లే భగవానుడు తృప్తిపడతాడు. ఇది అతని సౌలభ్యపరాకాష్ఠ- అని కిడాంబి ఆచ్చాన్ చేసిన వివరణం.

పై వివరణం ఆచ్చాన్‌కు భగవద్గుణాలలోగల గాఢమైన అభినివేశాన్ని సూచిస్తుంది.

ఆచ్చాన్ ఆత్మగుణపూర్ణత, ఆచార్యవిధేయత

ఈ ఐతిహ్యాన్ని తిరువాయ్‌మొళి (4-8-2)వ పాశుర వ్యాఖ్యానంలో నమ్బిళ్ళై ప్రస్తావించారు.

"పణిమానమ్ పిళైయామే అడియేనై ప్పణికొణ్ణ మణిమాయన్" (కైంకర్యాన్ని చేయడంలో ఏవిధమైన కొఱత లేకుండా దాసుడనైన నన్ను సంస్కరించి, నానుండి కైంకర్యాన్ని పరిగ్రహించిన మణివలె నీలవర్ణుడు- అని అంటూ భగవానుని పట్ల తమ కృతజ్ఞతను ఆళ్వార్లు వ్యక్తం చేశారు. ఈసూక్తిని వివరించే సందర్భంలో నమ్బిళ్ళై ఈడువ్యాఖ్యలో కిడాంబి యాచ్చాన్‌కు సంబంధించిన ఈక్రింది ఐతిహ్యాన్ని ఉట్టంకించారు.

"ఇజ్గే అరుళిచ్చెయ్యుమ్ వార్తై - ఎళున్దరుళి యిరుక్కిఱ మడత్తిలే శ్రీవైష్ణవర్కళ్ అముదు శెయ్యానిఱ్క, ఆచ్చాన్ తణ్ణీరముదు పరిమాఱుకిఱవర్ ఓరరుకు శాయనిట్ట పరిమాఱినార్. అత్తై ఉడైయవర్ కణ్ణు ఓరడి వన్దు ముదుకిలే మోది - "నేరే నిన్ఱన్రోపుడో పరిమాఱువతు" ఎన్న, "ఆచ్చాన్" పణిమానమ్ పిళైయామే అడియేనై ప్పణికొణ్ణ" ఎన్ఱు పణిత్తాన్.

భగవద్రామానుజులు వేంచేసి ఉండే మఠంలో శ్రీవైష్ణవులకు కొందఱికి తదీయారాధన జరిగే సమయంలో కిడాంబి ఆచ్చాన్ తీర్థాన్ని (తాగే నీటిని) అందిస్తున్నారు. తదీయారాధనలో తీర్థాన్ని కావలసినవారికి ఒకరు నీటిని ఒక పాత్రలో తీసికొని వారివారి నోటిలో కొంచెం కొంచెంగా పోయడం అలవాటు) ఈ రీతిలోనే, కిడాంబి ఆచ్చాన్ తీర్థాన్ని అడిగినవారికి నేరుగా నిలచి నీటిని వారికి పోయకుండా, ఒక పక్కగా ఉండి తీర్థాన్ని అందిస్తున్నారు. తీర్థాన్ని అడిగినవారు తాము కొంచెం వంగి ఆచ్చాన్ పోసే నీటిని గ్రహిస్తున్నారు. దీనిని చూచిన

శ్రీరామానుజులు వేగంగా అక్కడకు వచ్చి, కిడాంబి ఆచ్చాన్ వీపుపై తట్టి, "నేరుగా నిలచికదా తీర్థాన్ని అడిగినవారి నోటిలో పోయాలి. లేకపోతే తీర్థాన్ని తాగేవారికి పొఱమాఱుతుంది" అని మందలించారు. దీనిని విన్న కిడాంబి ఆచ్చాన్ **"పణిమానమ్ పిళైయామే అడియేనై ప్పణికొణ్ణ"** అనే ఆళ్వార్ల పాశురాన్ని అనుసంధించారట. "ఇంతటి చిన్న విషయాన్నికూడా గమనించి తమరు నన్ను తీర్చిదిద్ది సేవకునిగా గ్రహిస్తున్నారుకదా!" అని ఆచ్చాన్ తాత్పర్యం.

దీనివల్ల ఆచ్చాన్ ఆచార్యవిధేయత, వారి విషయంలో శ్రీరామానుజులకు గల ప్రీతి, శ్రద్ధ వ్యక్తం అవుతున్నాయి.

"అవన్ మేవి ఉఱైకోయిల్ .... తిరుక్కురుకూర్" (భగవానుడు ఆనందంతో అభిమానించి వేంచేసి ఉండే చోటు తిరుక్కురుకూర్) అని ఆళ్వార్లు అనుగ్రహించిన సూక్తిని వివరించే సందర్భం ఇది. పరమపదంలో వేంచేసి ఉన్నపుడు కూడా ఈ విభూతిలోనే జీవులు పడే కష్టాలను తలచి చాలా బాధతో స్వామి ఉంటాడని వివరిస్తూ కిడాంబి ఆచ్చాన్‌కు సంబంధించిన ఈ క్రింది ఐతిహ్యాన్ని నమ్బిళ్ళై **రువాయ్‌మొళి (4-10-2)** ఈడువ్యాఖ్యలో ప్రస్తావించారు.

"పరమపదత్తిలుమ్ సంసారికళ్ పడుమ్ క్లేశత్తై అనుసంధిత్తు త్తిరువుళ్ళత్తిల్ వెతుప్పోడేయాయిఱ్ఱు ఎళున్దరుళి యిరుప్పతు" ఎన్ఱు భట్టర్ అరుళిచ్చెయ్య, ఆచ్చానుమ్, పిళ్ళైయాళ్వానుమ్ ఇత్తై క్కేట్టు" "పరమపదత్తిల్ ఆనందనిర్భరనాయ్ ఇరుక్కిఱ ఇరుప్పిలే తిరువుళ్ళత్తిల్ ఒరు వ్యసనత్తోడే ఇరున్దాన్- ఎన్ఱె ఉచితమో?" ఎన్గిఱార్కళ్- ఎన్ఱు పణ్డితర్ ఎన్గిఱవన్ వన్దు విణ్ణప్పమ్ శెయ్య, "వ్యసనేషు మనుష్యాణాం భృశం భవతి దుఃఖితః" ఎన్ఱతు గుణప్రకరణత్తిలైయో? దోష ప్రకరణత్తిలైయో? ఎన్ఱు కేట్కుమాట్టిఱ్ఱిలీరో? ఇతు గుణమాకిల్ కుణమ్ ఎన్ఱు పేర్ పఱ్ఱిల్ - అజ్గిల్లాతతు ఉణ్డో! ఎన్ఱరుళిచ్చెయ్దార్" -భగవానుడు శ్రీవైకుంఠం వేంచేసి ఉన్నపుడు కూడా -"ఇక్కడ ఉండే నిత్యసూరులు, ముక్తులు నన్ను సదా దర్శించి ఆనందిస్తూ ఉండగా, మిగిలిన జీవులు అందు ఈ ఆనందాన్ని కోల్పోయి దుఃఖిస్తున్నారే! అని బాధతో భగవానుడు ఉంటాడు- అని భట్టర్ అన్నారు. ఈ మాటను విన్న ఆచ్చాన్, పిళ్ళైయాళ్వాన్ అనేవారు పరమపదంలో ఆనందంతో నిండి ఉండే స్థితిలో కూడా భగవానుడు మనస్సులో వ్యసనంతో ఉన్నాడని అనడం తగునా? అని అంటున్నారని పండితర్ అనేవారు ఒకరు భట్టర్ దగ్గరకు వచ్చి

విన్నపించగా- "ఇతరుల దుఃఖాన్ని చూచి తాను బాధపడడం సద్గుణమేకదా. శ్రీరామచంద్రుని కల్యాణగుణాలను గూర్చి పలికే సమయంలో అయోధ్యాపుర వాసులు- **"వ్యసనేషు మనుష్యాణాం భృశం భవతి దుఃఖితః"** అని అన్నారు. ఇది శ్రీరాముని సద్గుణాలనుగూర్చిన ప్రకరణంలోఉన్నదా! దోషప్రకరణంలో ఉన్నదా! అని వినలేరా! ఇది ఇతరుల దుఃఖాన్ని చూచి బాధపడే స్వభావం గుణమైతే గుణాలని చెప్పబడే వాటిలో ఇది అంతర్భవిస్తుంది కదా!" అని భట్టర్ సమాధాన మిచ్చారట.

ఇక్కడ ఒక విషయం గమనించాలి. మహావిద్వాంసులైన కిడాంబి ఆచ్చాన్‌కు భగవానుని దయాగుణవైభవాన్నిగూర్చి తెలియలేదని, అందువల్ల ఈ ప్రశ్నను వేశారని భావించడం తగదు. **"వ్యసనమనువర్తిక్కైయాలే హేయత్వనీకత్తైక్కుక్కుత్తై వారాతో?" ఎన్ఱ వడమాచార్యర్ పక్షత్తై యిట్టు క్షేపిక్క"** అనే అరుంబద వివరణ ప్రకారం, శాస్త్రదృష్ట్యా ఎవరైనా ఇటువంటి సందేహాన్ని వ్యక్తం చేసే అవకాశం ఉన్నదని తలచి, ఈ సందేహానికి తాము సమాధానం చెప్పదగిన ప్రతిభాపాండిత్యాలున్నా, సమర్థులైన భట్టర్ అనుగ్రహించే సరసమైన సమాధానాన్ని వినాలనే కుతూహలంతోనే ఈ ప్రశ్నను వేశారని భావించడం ఉచితం.

ఈ ఐతిహ్యం తిరుప్పావై 3వ పాశుర వ్యాఖ్యానంలోకూడా ప్రస్తావింప బడింది. విశేషమేమంటే, అక్కడ భట్టర్ వివరణాన్నిగూర్చి ప్రశ్నించిన వారి పేరు మాత్రం తెలుపబడలేదు.

శ్రీరంగ దివ్యాలయంలో ఆచ్చాన్ కైంకర్యం

శ్రీరామానుజులు శ్రీరంగాలయంలోని సేవలను వర్గీకరించి, కొన్ని కొన్ని సేవలకు కొంతమంది శిష్యులకు నియోగించారు. ఆ క్రమంలో ఆచ్చాన్‌కు నియమించిన కైంకర్య విశేషాలనుగూర్చి గురుపరంపరాప్రభావం ఈవిధంగా తెల్పింది.

"ఋగాది వేదచతుష్టయముమ్, పురాణేతిహాస ఇయల్, శ్రీరంగ మాహాత్మ్యమ్, పూర్వోత్తర మీమాంసాసూత్ర శ్రీభాష్య, ఆపస్తంబ బోధాయన సూత్ర స్తోత్ర గద్య పంచాంగ సంకీర్తనాదికళై నిత్యమాక సన్నిధియిలే తిరువారాధన కాలఙ్గళిలే విణప్పమ్ శెయ్యుమ్బడి తత్తత్ శాఖాధ్యాయికళాయ్, త్తమ్‌తిరువడికళై ఆశ్రయిత్తవర్‌కళాన గరుడవాహన పణ్డితర్, పెరియనంబి, తిరుప్పణి శెయ్‌వార్, నమ్బియార్, ఆళ్వాన్, గోవిందప్పెరుమాళ్, ఆచ్చాన్, తిరువరఙ్గత్తముదనార్, పిళ్ళాన్, శిఱియాళ్వాన్, అమ్మాళ్ ముదలానవర్‌కళై నియమిత్తు, అవర్‌కళై ఒరుకొత్తాక్కి, 'పట్టాళ్‌కొత్తు' ఎన్ఱుపేరిట్టు నడత్తియ వివరత్తై త్తెఱివిక్కిఱతు"

దీనిని బట్టి కిడాంబి ఆచ్చాన్‌ను శ్రీరామానుజులు కూరేశులు, అముదనార్, ఎమ్బార్‌మొదలైన ముఖ్యశిష్యుల కోవలోకి చేర్చారని కూడా తెలుస్తున్నది.

భగవద్రామానుజులకు కిడాంబి ఆచ్చాన్ పట్లగల అభిమానం అంతు లేనిది. ఒకనాడు శ్రీరామానుజులు ఆచ్చాన్‌ను ఆదరంగా దగ్గరకు పిలచి, "ఆచ్చాన్! ఆనాడు మీరు నాకోసం ఎంతో ప్రీతిని కలవారై, తిరుక్కోటియూర్ నంబి విషయంలో కోపించి - "ఇదేమి శిష్యాచార్య క్రమం!" అని అన్నారు కదా! అది తగునా! తగదు. **"మిక్కవేదియర్ వేదత్తి నుట్పొరుళ్ నిఱ్కప్పాడి ఎన్నెఞ్ఞుళ్ నిఱుత్తినాన్ తక్క శీర్ చ్చడకోపన్"** అని, **"తేవుమఱ్ఱఱియేన్"** అని, **"ఎన్నప్పనిల్ నణ్ణిత్తెన్ కురుకూర్ నమ్బి యెన్ఱక్కాల్ అణ్ణిక్కుమ్ అముదూఱుమ్ ఎన్నావుక్కే."** అని భాగవత శేషపర్యంతంగా కణ్ణినుణ్ శిఱుత్తామ్బు ప్రబంధంలో వ్యక్తం చేసిన మధురకవులకు నమ్మాళ్వార్లు పరదైవం అయినట్లే, తిరుక్కోట్టియూర్‌నమ్బి నాకు పరదైవం కదా! కనుక, భాగవతాభిమానం లేనివారికి మోక్షసిద్ధి సంశయమని శ్రీవరదరాజస్వామి తిరుక్కచ్చినంబికి పల్కిన విషయాన్ని నేను కూడా గుర్తించి, ఆచరించడం కోసం, మీ అభిమానంలో నన్ను అంతర్భవింపచేయడంకోసం ఆనాడు నన్ను ఆవిధంగా నమ్బి పరీక్షించారు సుమా!" అని అన్నారు. దీనిని విన్న ఆచ్చాన్ వినయంగా శిరస్సు వంచి నమస్కరించి క్షమను అర్థించారు.

ఆచ్చాన్ దివ్యదేశప్రావణ్యం

ఈ ఐతిహ్యం తిరువాయ్‌మొళి (6-7-5) వ పాశుర వ్యాఖ్యలో గోచరిస్తున్నది.

"పూవియల్ పొళిలుమ్ తడముమ్ అవన్ కోయిలుమ్ కణ్డు" అని ఆళ్వార్లు అనుగ్రహించిన సూక్తికి- భగవానుడు ఆదరంతో వేంచేసి ఉండే దివ్యదేశాన్ని దర్శించడమే కన్నులున్నందుకు ఫలం- అనే వివరణాన్ని నమ్బిళ్ళై తమ ఈడు వ్యాఖ్యలో అనుగ్రహిస్తూ, కిడాంబి ఆచ్చాన్‌కు చెందిన ఈక్రింది ఐతిహ్యాన్ని ప్రస్తావించారు.

"ఆచ్చానుమ్ ఆణ్డానుమాక కిళ్ళక్కే నడక్కిఱపోతు తిరుప్పేరుక్కు కిళ్ళక్కుప్పోకవుమ్ మాట్టాతే, ఏఱి త్తిరువడి తొళవుమ్ మాట్టాతే తిరుప్పేర్ నకరాన కోయిలై ప్పార్త్తు క్కొణ్డు ఇరున్దారామ్"

ఒకసారి కిడాంబి ఆచ్చాన్, ఆణ్డాన్ - శ్రీరంగానికి తూర్పుదిశలో **(తిరుక్కుడన్దైకు)** ప్రయాణం చేస్తూ దారిలో తిరుప్పేర్‌నకర్‌ను **(అప్పక్కుడత్తాన్ సన్నిధిని)** దర్శించారు. ఆ కోవెలను దాటి, ముందుకు ప్రయాణాన్ని చేయలేక, ఆ కోవెలనే దర్శిస్తూ మాటిమాటికి వెనుకకు తిరిగి చూస్తూ ఉన్నారట.

దీనివల్ల కిడాంబి ఆచ్చాన్‌కు గల గొప్ప దివ్యదేశప్రావణ్యం వ్యక్తమవు తున్నది.

ఆచ్చాన్ శాస్త్రపాండిత్యం

శ్రీకృష్ణుని విశ్లేషించి బాధపడే గోపికాభావనలో నమ్మాళ్వార్లు **'తుణై పిరిన్దార్ తుయరముమ్ నినైకిల కోవిన్దా"** అనిపల్కిన సూక్తినిగూర్చి కిడాంబి ఆచ్చాన్ పల్కిన మాటను నమ్బిళ్ళై **తిరువాయ్‌మొళి (10-3-4)** ఈడువ్యాఖ్యలో ఈక్రిందివిధంగా ఉట్టంకించారు.

"తుణై ఎన్దాల్ ద్వినిష్ఠమాయ్ అన్ను కాణ్ ఇరుప్పతు -ఎన్నుమ్ ఆచ్చాన్"

"తుణై" -అంటే తోడు. లోకంలో తోడుగా ఉండడమనే ద్వినిష్ఠంగా ఉంటుంది. దంపతులలో ఒకరి కొకరుతోడుగా ఉండడం సహజంకదా ! అయితే, ఇక్కడ **"తుణై"** అనే పదం ఇద్దరిని- అంటే -గోపికలను, శ్రీకృష్ణుని తెలుపదు. భగవానుని మాత్రమే తెలుపుతుది- అని అచ్చాన్ వివరణం. గోపికలు విశ్లేషించినందు వల్ల అతడొక్కడే తోడు. మిగిలినవారెవరూ తోడు కారు- అనే భావంతో గోపికాదశ లోని నమ్మాళ్వార్లు ఈవిధంగా అనుగ్రహించారని కిడాంబి ఆచ్చాన్ ఉద్దేశ్యం. ఇటువంటి వివరణమే పెరియతిరుమొళి **(3-6-1)** పాశురవ్యాఖ్యలో కూడా కన్పిస్తున్నది.

శాస్త్రీయవైఖరిలో ఆచ్చాన్ చేసిన ఈ వివరణం వారికి నమ్మాళ్వార్ల సూక్తులలో గల అగాధమైన అవగాహనకు, వారి శాస్త్ర పాండిత్యానికి సూచకం.

ఆచ్చాన్ కార్యనిర్వహణ సామర్థ్యం

శ్రీరామానుజులు బ్రహ్మసూత్రాలకు విశిష్టాద్వైతసిద్ధాంతపరంగా వ్యాఖ్యానాన్ని అనుగ్రహించి, ఆ శ్రీకోశాన్ని కాశ్మీరదేశంలోని శారదాపీఠానికి పంపించి అది జగద్విఖ్యాతిని చెందేటట్లు చేయాలని తలచారు. ఆ కార్యాన్ని నిర్వహించగల పూర్ణమైన ప్రజ్ఞను, సామర్థ్యాన్ని కలవారు కిడాంబి ఆచ్చాన్ అని భావించి ఆచ్చాన్‌వద్ద ఆ వ్యాఖ్యాన గ్రంథాన్ని ఇచ్చి, వారి వెంట కిడాంబి పెరుమాళ్‌వంటి కొందరు శిష్యులను పంపించారు. ఆచ్చాన్ బ్రహ్మసూత్రవ్యాఖ్యాన శ్రీకోశాన్ని కాశ్మీరదేశానికి తీసికొనిపోయి శారదాపీఠంపై ఉంచగానే, శారదాదేవి దానిని సగౌరవంగా గ్రహించడమే కాక, ఆ వ్యాఖ్యానానికి శ్రీభాష్యమని, వ్యాఖ్యను అనుగ్రహించిన శ్రీరామానుజులకు భాష్యకారులని పేరును పెట్టి సమ్మానించింది. ఈ వృత్తాంతాన్నిబట్టి ఆచ్చాన్‌యొక్క జ్ఞానవైభవం. కార్యనిర్వహణసామర్థ్యం వ్యక్తమవుతున్నది.

గోపికకు ఆచ్చాన్ మోక్షాన్ని ప్రసాదించడం

"తుమ్బియూర్‌క్కొణ్డి" అనే పేరును కల్గిన ఒక గోపిక పెరుగును అమ్ముతూ జీవనం సాగించేది. ఆమె, తాను శ్రీరామానుజుల మఠానికి అమ్మిన పెరుగుకు తగిన వెలను గ్రహించడంకోసం మఠానికి రాగా, ఆచ్చాన్ ఆమెకు శ్రీపాదతీర్థాన్ని, ప్రసాదాన్ని ఇచ్చారు. వాటిని సేవించిన ఫలంగా ఆమెకు స్వరూపజ్ఞానం కల్గింది. అందువల్ల ఆమె ఆచ్చాన్‌తో "నేను అమ్మిన పెరుగుకు సొమ్ము ఏమీ వద్దు. దానికి బదులుగా పరమపదాన్ని అనుగ్రహించండి, చాలు" అని వేడింది. "దానిని శ్రీవేంకటేశ్వరుడే ఇవ్వగలడు" - అని ఆచ్చాన్ అన్నారు. "అయితే, మీరే తిరువేఙ్కడ ముడైయాన్‌కు ఒక చీటీని వ్రాసి ఇవ్వండి"- అని ఆ గోపిక అన్నది. ఆచ్చాన్ ఆవిధంగానే ఒక చీటిని వ్రాసి ఆమెకు ఇచ్చారు. దానిని తీసికొని ఆ గోపిక నేరుగా తిరుమలకు పోయి, శ్రీవేంకటేశ్వరునివద్ద దానిని చదివి చూపించింది. శ్రీవేంకటేశ్వరుడు వెంటనే ఆచ్చాన్ చీటీలో వ్రాసిన రీతిలో ఆమెకు పరమపదాన్ని అనుగ్రహించాడు. ఈ విషయాన్ని శ్రీపిళ్ళైలోకమ్ జీయర్ **"రామానుజార్య దివ్యచరితై"** అనే గ్రంథంలో ప్రస్తావించారు.

కూరేశుల విషయంలో ఆచ్చాన్‌కు గల గౌరవం

కిడాంబి ఆచ్చాన్ కూరేశుల సన్నిధిలో తిరువాయ్‌మొళిప్రబంధాన్ని కొన్నాళ్ళు శ్రవణం చేశారు. ప్రతిదినం కాలక్షేపం పూర్తికాగానే ఆచ్చాన్ శ్రీరామానుజుల సన్నిధికి

తిరిగి వచ్చేవారు. ఒకనాడు ఆచ్చాన్ కాలక్షేపంనుండి రామానుజులవద్దకు చాలా ఆలస్యంగా తిరిగి వచ్చారు. వారి రాకలోని ఆలస్యానికి కారణమేమని శ్రీరామానుజులు ఆచ్చాన్‌ను ప్రశ్నించారు. ఆచ్చాన్ అపుడు కూరేశులవద్ద తిరువాయ్‌మొళి ప్రబంధాన్ని శ్రవణం చేస్తున్నాను- అని అన్నారు. ఈనాడు ఏ దశకార్థాన్ని కూరేశులు వివరించారు ? అని శ్రీరామానుజులు ప్రశ్నించారు. **"పిఱన్ద వాఱుమ్"** అనే దశకం ప్రస్తావనకు వచ్చింది -అని ఆచ్చాన్ అన్నారు. "దానినిగూర్చి కూరేశులు ఏమని వివరించారు?" అని అడిగారు శ్రీరామానుజులు. "ఏమీ వివరించలేదు"- అని ఆచ్చాన్ అనగా, "అయితే వారు చెప్పిదేమి? నీవు విన్నది ఏమి మరి!" అని శ్రీరామానుజులు అన్నారు.

"కూరేశులు ఆ దశకాన్ని వివరించాలని ఆరంభించి ముందుగా **"పిఱన్ద వాఱుమ్"** అనే పాశురాన్ని అనుసంధించారు. ఆ పాశురంలోని ఆళ్వార్ల అభినివేశాన్ని తలచి, చాలా సేపు కఱిగి నీరై, "భగద్విషయంలో పూర్తిగా అవగాహించినవారు ఈ ఆళ్వార్లు ఒకరే సుమా! వీరి మనస్సులో గల భావ బంధాన్ని మనం ఏమని వివరించగలం! అది మన వాక్కుకు, మనస్సుకు అందేదికాదు." అని మాటిమాటికి పల్కుతూ చాలా సేపు మనస్సులో ద్రవిస్తూ ఊరికే ఉండిపోయారు- అని ఆచ్చాన్ అన్నారు. శ్రీరామానుజులు కూరేశులకు ఆళ్వార్ల సూక్తులపట్ల గల ఆ అభినివేశాన్ని విని, **"ఎన్న పరమచేతనో!"** అని విస్మయాన్ని పొందారు. ఈ వృత్తాంతాన్నిబట్టి కూరేశుల విషయంలో ఆచ్చాన్‌కు గల ఆదరం, తమకు తెలిసిన విషయాన్నికూడా ఎవరైనా పల్కితే ఆదరంగా వినే ఆచ్చాన్ స్వభావం వ్యక్తమవుతున్నాయి.

భట్టర్ విషయంలో ఆచ్చాన్‌కు కల ఆదరమ్

"ఆళ్వియాన్ అరుళ్తరువాన్ అమైకిన్ఱాన్ అతు నమతు విది వకైయే" (తిరువాయ్‌మొళి- 10-6-1) అని అంటు నమ్మాళ్వార్లు- "భక్తులు విధి ప్రకారమే భగవానుడు అనుగ్రహించాలని చూస్తాడు" అని పల్కిన సూక్తిని వివరించే సందర్భంలో నంబిళ్ళై కిడాంబి ఆచ్చాన్‌కు సంబంధించిన ఈక్రింది ఐతిహ్యాన్ని ప్రస్తావించారు.

"ఆచ్చాన్ భట్టరుక్కు స్నేహిత్తిరుక్కుమ్ పోర ఇళైయాళ్వాన్, ఆచ్చానై భట్టర్ తమ్మై ఆశ్రయిత్తివర్కళై క్కాట్టిలుమ్ నీతొళు అనువర్తిప్పాన్ ఎన్? ఎన్ఱ కేట్క, "నీ అన్ఱు కణ్డిలైకాణ్. ఎమ్బెరుమానార్ భట్టర్ కైయిలే పుస్తకత్తై క్కొడుత్తు తిరుమున్బే

ఒరు శ్లోకత్తై విణ్ణప్పమ్ శెయ్‌తువిత్తు, తిరుప్పిరమ్బుక్కు పుఱప్పట్ట చ్చుట్రుమ్ పార్త్తరుళి, "నమ్ముడైయార్ అడఙ్గలుమ్ నమ్మై నినైత్తిరుక్కుమాపోలే ఇవనై నినైత్తిరుఙ్గోళ్" ఎన్ఱరుళిచ్చెయ్‌తార్.

కిడాంబి ఆచ్చాన్ భట్టర్ విషయంలో చాలా ప్రీతిని గౌరవాన్ని కలవారు. ఆచ్చాన్, భట్టర్ ఇద్దరూ సబ్రహ్మచారులు. కనుక ఆచ్చాన్‌పట్ల భట్టర్ చాలా గౌరవ ప్రతిపత్తిని కల్గిఉండేవారు. ఆవిధంగానే, తమ సబ్రహ్మచారి అయిన ఆళ్వాన్ పుత్రులైన భట్టర్‌పట్ల ఎంతో ఆదరాన్ని కల్గి ఉండేవారు. ఒకనాడు, ఇళైయాళ్వాన్ అనే కిడాంబి ఆచ్చాన్ శిష్యులు ఆచ్చాన్ వద్దకు వచ్చి, "భగవద్రామానుజుల శిష్యులైన మీరు భట్టర్ శిష్యులకంటే వారిపట్ల మిక్కిలి గౌరవంతో, అణకువతో ప్రవర్తించడానికి ఏమికారణం? అని అడిగారు. అపుడు ఆచ్చాన్ "ఆనాడు భగవద్రామానుజులు చేసిన పనిని నీవు చూడలేదుసుమా ! భగవద్రామానుజులు భట్టర్‌కు చేతిలో ఒక పుస్తకాన్ని ఇచ్చి, శ్రీరంగనాథుని సన్నిధిలోని వేత్రదండానికి లోపలవైపుకు తీసికొని పోయి, ఒక శ్లోకాన్ని విన్నపించేటట్లుచేసి, తరువాత నేత్రదండాన్ని దాటి వెలుపలకు వచ్చి, చుట్టూ ఉన్నవారిని పరికించి చూస్తూ - "మనవారందఱు నన్ను గౌరవంగా చూస్తున్నట్లే ఇతనిని (భట్టర్‌ను) కూడా భావించండి" అని అన్నారు. అందువల్లనే నేను భట్టర్‌ను శ్రీరామానుజులుగానే భావించి చాలా అణకువతో ప్రవర్తిస్తున్నాను- అని అన్నారు.

ఈ ఐతిహ్యంవల్ల కిడాంబి ఆచ్చాన్‌యొక్క మహోన్నతమైన వ్యక్తిత్వం వ్యక్తమవుతున్నది. తమ ఆచార్యులు తమ కంటే చిన్నవారైన భట్టర్‌ను గౌరవించమని పల్కినా, ఆమాటను నిరాదరించకుండా ఆ జీవితం భట్టర్‌పట్ల ఆచార్యవత్ ప్రతిపత్తిని కల్గి ఉన్న ఆచ్చాన్ వ్యక్తిత్వం ఎంతో గొప్పది కదా!

వేదాంత దెశికుల కృతులలో ఆచ్చాన్ ప్రస్తావన

శ్రీమద్వేదాంత దేశికులు రహస్యత్రయసారంలో రెండు మార్లు కిడాంబి ఆచ్చాన్‌ను గూర్చి ప్రస్తావించారు. సిద్ధోపాయశోధనాధికారంలో **"ఎమ్బెరుమానై చ్చొన్నవిడత్తిలే పిరాట్టియైయుమ్ శొల్లిన్ఱాళ్"** ఎన్ఱు తొడఙ్గి ఉడైయవర్ అరుళిచ్చెయ్‌తవార్‌త్తైయై ఆచ్చాన్ పక్కలిలే కేట్టు నంజీయర్ సంగ్రహిత్తార్" అని పల్కిన దేశికసూక్తినిబట్టినంజీయర్‌కూడా కిడాంబి ఆచ్చాన్ సన్నిధిలో కొన్ని సంప్రదాయార్థాలను ఆలకించినట్లు తెలుస్తున్నది.

నిగమనాధికారంలో గల ఈక్రింది శ్లోకంలో ఆచ్చాన్ ప్రస్తావన కన్పిస్తుంది.

ఇతి యతిరాజమహాసనపరిమళపరివాహవాసితాం పిబత ।
విబుధపరిషన్నిషేవ్యాం వేదాంతోదయనసంప్రదాయసుధామ్ ॥

(ఈవిధంగా యతిరాజుల మహాసనంలోని (పంటశాలలోని) పరిమళ ప్రవాహంచేత సువాసితమైనది, పండితుల గోష్ఠికి ఆదరణీయమైనది, న్యాయ శాస్త్రానికి ఉదయనులవలె, వేదాంతశాస్త్రానికి ఉదయనులై ప్రకాశించే కిడాంబి ఆచ్చాన్‌యొక్క సంప్రదాయమనే అమృతాన్ని పానంచేయండి)

ఈశ్లోకంవల్ల కిడాంబి ఆచ్చాన్ పట్ల దేశికులకు గల గొప్ప భక్తి ప్రపత్తులు వ్యక్తమవుతున్నది.

పరమపదసోపానమనే రహస్యగ్రంథంలోకూడా ఒక పాశురంలో శ్రీదేశికులు కిడాంబి ఆచ్చాన్‌గూర్చి ప్రస్తావించారు.

అడర్ పుళ్ళరశినుమ్ అన్దణర్ మాట్టినుమ్ ఇన్నముద
క్కడఱ్ఱళ్ళితన్నినుమ్ కావిరియుళ్ళ ముకన్ద పిరాన్
ఇడైప్పిళ్ళై యాకి యురైత్తతురైక్కు మెతివరనార్
మడైప్పళ్ళి అన్ద మణమెఙ్గళ్ వార్త్తైయుళ్ మన్నియతే

గొప్ప బలిమిని కల పక్షిరాజు అయిన గరుడునిలో కంటే, బ్రాహ్మణుల ధనం అయిన వేదాలలో కంటే, భోగ్యమైన అమృతం అయిన లక్ష్మీదేవి అవతరించిన క్షీరాబ్ధిలోకంటే, కావేరీనది మధ్యలో ఉండే శ్రీరంగంలో మిక్కిలి ఆదరాన్ని కల శ్రీరంగనాథుడు గోపికాబాలుడైన శ్రీకృష్ణుడై అవతరించి వ్యక్తం చేసిన భగవద్గీతయొక్క అర్థాన్ని గీతా భాష్యంలో అనుగ్రహించారు. ఆ అర్థం యతివరుల మడైప్పళ్ళి ద్వారా (కిడాంబి ఆచ్చాన్ మూలంగా) వీచిన సువాసన (వారి శిష్యపరంపరలో చేరిన) మా గ్రంథాలలో మన్నికగా ఉన్నది.

కిడాంబి ఆచ్చాన్ తనియన్ శ్లోకాలు

రామానుజపదాంభోజయుగళీ యస్య ధీమతః ।
ప్రాప్యం చ ప్రాపకం వందే ప్రణతార్తిహరం గురుమ్ ॥

(భగవద్రామానుజుల శ్రీచరణపద్మయుగం ఏ ధీమంతునకు ప్రాప్యము, ప్రాపకమో, ప్రణతార్తిహరులనబడే తిరునామాన్ని కల ఆ కిడాంబి ఆచ్చాన్ అనే ఆచార్యులను నమస్కరిస్తున్నాను.)

ఆస్తికాగ్రేసరం వందే పరివ్రాడ్గురుపాచకమ్ ।
యాచితం కురుకేశేన ప్రణతార్తిహరం గురుమ్ ॥

(ఆస్తికులలో గొప్పవారు, కురుకేశులనే తిరునామాన్ని కల్గిన తిరుక్కోట్టియూర్ నమ్బిచే భగవద్రామానుజుల పాచకకైంకర్యాన్ని నిర్వహించడంకోసం యాచింపబడినవారు, ఆ పిమ్మట శ్రీరామానుజులకు పాచకకైంకర్యాన్ని చేసిన వారైన కిడాంబి ప్రణతార్తిహరులనే కిడాంబి ఆచ్చాన్‌కు నమస్కరిస్తున్నాను.)

శ్రీభాష్యం దర్శయిత్వా యతిపతిరచితం శారదాయై నివృత్తో
నత్వా శ్రీవేంకటేశం పథి పరమపదం దత్తవాన్ గోపికాయై ।
ఆఖ్యాం వేదోత్తమాంగోదయన ఇతి దధత్ భాష్యకారేణ దత్తాం
ఆత్రేయాచార్యవిష్ణో రనుజ మనుదినం సాదరం తం నమామి ॥

(భగవద్రామానుజప్రణీతమైన శ్రీభాష్యాన్ని ఎవరు కాశ్మీరదేశంలోని సరస్వతీదేవికి చూపించి తిరిగి వచ్చారో, తిరిగి వచ్చే దారిలో తిరుమలలోని శ్రీవేంకటేశ్వరునకు నమస్కరించి, ఒక గొల్లవనితకు పరమపదాన్ని ఇచ్చారో, శ్రీరామానుజుల చేత అనుగ్రహింపబడ్డ **"వేదాంతోదయనులు"** అనే తిరునామాన్ని ధరించారో, ఆత్రేయకులంలో అవతరించిన విష్ణువు అనే పేరు గల ఆచార్యులకు తమ్ముడైన ఆ కిడాంబి ఆచ్చాన్‌కు ప్రతిదినం ఆదరంతో నమస్కరిస్తున్నాను)

కిడాంబి ఆచ్చాన్ వాళ్‌తిరునామం

అత్తనాళిల్ శిత్తిరైయిల్ కచ్చి వన్దోన్ వాళ్‌యే
అరుళాళర్ తిరునామమ్ అడైన్ద శెల్వన్ వాళ్‌యే
ఇన్బుడనే కోట్టినమ్బి ఆణై ఏఱ్ఱాన్ వాళ్‌యే
అన్బుడనే ఎతిరాశర్క్కు అముదళిత్తాన్ వాళ్‌యే
తన్మైమికు పాడియమ్ శారదైయార్క్కోన్దాన్ వాళ్‌యే
నమ్బుమికు ఇడైచ్చిక్కు ముత్తి యళిత్తాన్ వాళ్‌యే
వణ్మైమికు వేదాన్త ఉదయనరామ్ వాళ్‌యే
నమ్ అణ్ణల్ కిడామ్బి ఆచ్చాన్ నానిలత్తిల్ వాళ్‌యే

(చైత్రమాసం హస్తానక్షత్రంలో కాంచీనగరంలో అవతరించినవారికి మంగళం. శ్రీవరదరాజస్వామి తిరునామాన్ని పొందిన సంపద్రూపులకు మంగళం. ఆనందంతో

తిరుక్కోట్టియూర్ నంబి ఆజ్ఞను శిరసా వహించినవారికి మంగళం. ప్రేమతో (భక్తితో) యతిరాజులకు తళిహ ప్రసాదాన్ని సమర్పించినవారికి మంగళం. మిక్కిలి గొప్పదైన శ్రీభాష్యాన్ని శారదాదేవికి ఇచ్చినవారికి మంగళం. మిక్కిలి విశ్వాసాన్ని కల గోపికకు ముక్తిని అనుగ్రహించినవారికి మంగళం. గొప్పవారైన వేదాంతో దయనులనే పేరును కలవారికి మంగళం. మన స్వామి కిడాంబి ఆచ్చాన్‌కు ఈ విశాలమైన భూమిలో మంగళం.)

కిడాంబి ఆచ్చాన్ మంగళశ్లోకం

పాచకో యతిరాజస్య ప్రణతార్తిహరో గురుః ।
యో ఘటాంబుకులశ్రేష్ఠః తస్మై ప్రాజ్ఞాయ మంగళమ్ ॥

వేదాంతదేశికులు- కిడాంబి ఆచ్చాన్‌వంశం.

వేదాంతదేశికుల మేనమామ కిడాంబి రామానుజాచార్యులవారు. వీరే దేశికులకు ఆచార్యులు. **ఇరామానుశప్పిళ్ళాన్ అని, వాదిహంసాంబుదాచార్యులని,** అప్పుళ్ళార్ అనే పేర్లతో వీరు ప్రసిద్ధులు.

మణవాళమహాములు - కిడాంబి ఆచ్చాన్‌వంశం

మణవాళమహాముల తిరుముడి సంబంధాన్ని, తిరువడి సంబంధాన్ని కల్గిన గొప్పవంశం కిడాంబివంశం. మణవాళమహాముల శ్రీభాష్య కాలక్షేపాచార్యులు కిడాంబి తిరుమలై నాయనార్. వీరి సహజనామం వరదాచార్యులవారు. వీరు వేదాంతదేశికుల శిష్యులైన బ్రహ్మతంత్ర స్వతంత్రజీయర్ శిష్యులని కొందఱి అభిప్రాయం. కాని, ఇది సరికాదు - అని **శ్రీమాన్ ఎం.ఎస్. వేంకటాచార్యస్వామివారి** అభిప్రాయం.

మూవాయిరప్పడి గురుపరంపరాప్రభావంలో -కిడాంబి తిరుమలై నాయనార్ **"పురుషోత్తమదేశికర్"** అని వ్యవహరింపబడ్డారు. మణవాళమహాములు అనుగ్రహించిన శ్రీభాష్యతనియన్ చివరలో గల **"అభీష్టవరదప్రద"** నామం శ్రీమణవాళమహాములకు శ్రీభాష్యాన్ని అనుగ్రహించిన తిరుమలై నాయనార్‌ను తెలుపుతుంది. కిడాంబి వంశానికి చెందిన, కిడాంబి అప్పుళ్ళార్ శ్రీమణవాళ మహాముల ప్రధానశిష్యులైన అష్టదిగ్గజాలలో ఒకరు. వీరి తనియన్ శ్లోకం.

కాంతోపయంతృయోగీంద్రపర్వతైంకర్యధూర్వహమ్ ।
తదేకదైవతం సౌమ్యం రామానుజగురుం భజే ॥

వీరి వంశానికి చెందినవారికి కాట్టుమన్నార్‌కోయిల్ అనే దివ్యదేశంలో ప్రథమతీర్థాదిమర్యాదలు జరుపబడుతున్నాయి.

కిడాంబి ఆచ్చాన్ అనుగ్రహించిన తిరువిరుత్త ప్రబంధ తనియన్

కరువిరుత్తక్కుழி నీత్తపిన్ కామక్కడుమ్ కుழி వీழ్ందు
ఒరువిరుత్తమ్ పుక్కుழులుఱువీర్! ఉయిరిన్ పొరుళ్‌కట్కు
ఒరువిరుత్తమ్ పుకుతామల్ కురుకైయర్ కోనురైత్త
తిరువిరుత్తత్తురడిఓ**ర్ నిన్ఱి**రీర్! తిరునాట్టకత్తే

(గర్భ-జన్మ-బాల్య-యౌవన-జరా-మరణ-నరకాలనే ఏడు విధాలైన క్లేశాలను మాటిమాటి అనుభవిస్తూ, సంసారంలో పరిభ్రమించే మానవులారా! మీరు దేహమే ఆత్మ- అనే భ్రమను పోగొట్టుకొని, నమ్మాళ్వార్లు అనుగ్రహించిన తిరువిరుత్త ప్రబంధంలోని ఒక పాదాన్ని అయినా పఠించి, తత్ఫలంగా పరమ పదంలో నిత్యవాసం చేయండి. మీరు తరించడానికి తిరువిరుత్తంలో ఒక పాశురంలోని ఒక పాదాన్ని అనుసంధించినా చాలు.)

దీనినిబట్టి ఆచ్చాన్ ద్రావిడభాషావైదుష్యం తెలుస్తున్నది.

పూర్వాచార్యులు తాము అనుగ్రహించిన దివ్యప్రబంధవ్యాఖ్యానాలలో ఆయా సందర్భాలను వివరిస్తూ కొంతమంది పూర్వాచార్యుల తిరునామాలను, వారు పల్కిన సూక్తులను ఉట్టంకించారు. వారిలో కిడాంబి ఆచ్చాన్‌కు సంబంధించిన వివరాలు ఇతఃపూర్వమే తెలుపబడ్డాయి. ఈవిధంగానే ఒక చోట కిడాంబి పెరుమాళ్ అనే ఆచార్యుల ప్రసక్తి, ఇంకొక చోట కిడాంబి అమ్మాళ్ అనే ఆచార్యుల ప్రసక్తి గోచరిస్తున్నది. వీరిలో కిడాంబి పెరుమాళ్ భగవద్రామానుజుల సమకాలీనులు, 74 మంది సింహాసనాధి పతులలో ఒకరు కాగా, కిడాంబి అమ్మాళ్ పరాశరభట్టర్‌కు తర్వాతికాలంవారు అని తెలుస్తున్నది.

కిడాంబిపెరుమాళ్

ఈ ఆచార్యుల ప్రస్తావనను పెరుమాళ్ తిరుమొழிలోని **"తరుతుయరమ్"** అనే అయిదవ దశకం మొదటి పాశురవ్యాఖ్యలో ఈ క్రిందివిధంగా పెరియవాచ్చాన్

పిళ్ళై చేశారు. **"ఒరునాళ్ నిత్యసంసారియాయ్ ప్పోన్దవనుక్కు భగవద్విషయత్తిల్ రుచి పిఱక్కైక్కు అడి ఎన్ ?- ఎన్ఱు విచారిక్కచ్చెయ్తే, "యాదృచ్ఛికసుకృతమ్" ఎన్న, "అజ్ఞాతసుకృతమ్" ఎన్నప్పిఱన్దతు. అవ్వళవిలే కిడాంబి ప్పెరుమాళ్ ఇరున్దవర్, "నమక్కు భగవత్సమాశ్రయణమ్పోలే సుకృతదేవరెన్ఱు ఒరువర్ ఉణ్డో !" ఎన్దార్. పిళ్ళై తిరునఱైయూర్ అరైయర్ "సుకృతమ్ ఎన్ఱ శొల్లుకిఱ నీర్తామ్ నినైత్తిరుక్కిఱతు ఎత్తైక్కాణ్ ?" ఎన్దార్.**

ఒకనాడు శ్రీరంగంలోని శ్రీరంగనాథుని దివ్యాలయంలో పెరియతిరుమండపానికి కింద పూర్వాచార్యులంతా కలసి సంప్రదాయవిషయాలను చర్చించు కొనే సందర్భంలో- "నిత్యసంసారిగా ఉండే జీవునకు భగవానుని విషయంలో ఆదరం కల్గడానికి ఏమి కారణం?" అనే విషయం ప్రస్తావనకు వచ్చింది. దీనికి కొందరు జీవుడు తాను అనుకోకుండా యాదృచ్ఛికంగా చేసిన సుకృతం కారణమని అనగా, మఱికొందరు జీవుడు తనకు తెలియకుండా చేసిన అజ్ఞానసుకృతం కారణమని అన్నారు. అపుడు అక్కడ ఉన్న కిడాంబి ప్పెరుమాళ్ అనే ఆచార్యులు "మనకు భగవత్సమాశ్రయనంవలెనే, పుణ్యం అనే ఇంకొక పొందదగిన దేవతకూడా ఉన్నదా ఏమి !" అని ప్రశ్నించారు. దీనికి సమాధానంగా పిళ్ళైతిరునఱైయూర్ అరైయర్- మీరు పుణ్యమని భావించినది దేనిని? భగవానుని కంటే వేఱొక పుణ్యమని ఉన్నదని అనుకుంటున్నారా! పుణ్యమంటే ఆ భగవానుడే కదా! అందువల్ల ఆ భగవానుడే జీవునకు తనపట్ల అభినివేశాన్ని కల్గించి స్వీకరిస్తాడు" అని అన్నారు.

కిడాంబి అమ్మాళ్

ఈ ఆచార్యుల ప్రస్తావన పెరియతిరుమొళి (6-3-4) పాశురవ్యాఖ్యలో తిరుమంగైయాళ్వార్ల వాగ్వైభవాన్ని ప్రస్తుతించే సందర్భంలో గోచరిస్తుంది. శ్రీపరాశరభట్టర్‌కు గల వాక్పటిమనుగూర్చి శిఱియాణ్డాన్ పెరుమాళ్ అనే ఆచార్యులు తమతో పల్కినట్లుగా కిడాంబి అమ్మాళ్ పలుమార్లు ఈవిధంగా అనేవారట. - "మనం పలికే మాటలనేకదా భట్టర్ పల్కుతున్నారు- అని మనం భావించరాదు. వారి పల్కులలో ఒక వైలక్షణ్యం ఉన్నది. కంటిముందు కన్పించే కొయ్యస్తంభాన్ని మనం స్తంభం అని అంటే, అది నిష్ప్రయోజనమైన- నీరసమైన కొయ్య- అని తోస్తుంది. అయితే, అదే మాటను భట్టర్ పల్కితే, అదే స్తంభం చిగుళ్ళతో, కొమ్మలతో రెపరెపలాడుతున్నట్లు తోస్తుంది. అది భట్టర్‌యొక్క వాక్పటిమ"- అని శిఱియాణ్డాన్ పెరుమాళ్ అన్నారట.

పై సందర్భాన్నిబట్టి కిడాంబి అమ్మాళ్ పరాశరభట్టర్‌కు తరువాతి కాలంవారు అని, భట్టర్ విషయంలో గొప్ప గౌరవాన్ని కలవారని తెలుస్తున్నది. కిడాంబి ఆచ్చాన్‌కూడా భట్టర్‌పట్ల గొప్ప ఆదరాభిమానాలను కల్గి ఉండేవారని, దానికి ముఖ్య కారణం శ్రీరామానుజుల ఆదేశమేనని పూర్వమే తెలుపబడింది.

ఆధునికకాలంలో కిడాంబివంశవైభవం

కిడాంబివంశం పలు ప్రాంతాలలో విస్తరించడమే కాక, గొప్ప పండిత వంశంగా కూడా పేరు పొందింది. గత శతాబ్దిలో జీవించిన తిరువహీంద్రపురం **ఉ.వే. శ్రీమాన్ కచ్చిక్కిడామ్బి భాష్యకారాచార్యస్వామి**వారి వైదుష్యం పండిత ప్రకాండుల ప్రశంసలను పొందింది. వీరి తిరుక్కుమారులైన **ఉ.వే. శ్రీమాన్ యామునాచార్య స్వామివారు** ఉభయవేదాంతాలలో, ఆగమంలో పరిపూర్ణమైన పాండిత్యాన్ని కలవారు. **కాంచీ మహావిద్వాన్ ప్ర.భ. అణ్ణంగరాచార్యస్వామివారివంటి** విద్వత్తల్లజుల ప్రశంసలకు పాత్రమయ్యారు. శ్రీ యామునాచార్య స్వామివారి కుమారులైన శ్రీమాన్ పరకాలన్ స్వామివారు యథాశక్తి సంప్రదాయ ప్రచారానికి పాటుపడుతున్నారు.

కాలక్రమంలో కిడాంబి వంశానికి చెందిన ఒక కుటుంబం కృష్ణాజిల్లాలోని నూజీవీడు సంస్థానాధీశులచే ఆహ్వానింపబడి అక్కడ స్థిరపడింది. ఆ వంశానికి చెందిన, 19వ శతాబ్దిలో అవతరించిన వీరరాఘవాచార్యస్వామివారు, గొప్ప వైయాకరణులు. ఉభయవేదాంత విద్వద్వరేణ్యులు. తిరుపతి మహంతుచేత సత్కార్యాన్ని పొందినవారు. నూజీవీడు సంస్థాన ఆస్థానవిద్వాంసులుగా వెలుగొందిన వీరి కుమారులు **శ్రీనివాసరామానుజా చార్యస్వామివారు**కూడా గొప్ప వైయాకరణులు. పితృపాదులవలె నూజీవీడు సంస్థానాన్ని అలంకరించారు. ఉభయవేదాంతాలలో పాండిత్యాన్ని గడించినవారు. వీరి ఏకైకపుత్రులు **మహావిద్వాన్ కిడాంబి గోపాలకృష్ణమాచార్యస్వామివారు.** వీరు అసాధారణ మేధాసంపన్నులు. సమధుర కవితాప్రణయనధురీణులు, క్రమాంతం వేదాన్ని అధ్యయనం చేసినవారు. ఉభయవేదాంతాలలో, ధర్మశాస్త్రాలలో ఉద్దండపండితులు. ప్రత్యేకించి, అభినవభూతపురిగా ప్రసిద్ధి చెందిన నరసాపురంలో వేంచేసి ఉండే భగవద్రామానుజుల అవతారోత్సవాలలో దివ్యప్రబంధసేవా- భాగవత తదీయారాధనాది కైంకర్యనిర్వహణలో సాటి లేని మేటి. వీరి ఆధ్యక్ష్యంలో 20వ శతాబ్ది పూర్వార్ధంలో పెంటపాడు (ప.గో. జిల్లా)లో జరిగిన ఉభయవేదాంత సభలలో వీరి అసమాన

పాండిత్యాన్ని, గంభీరమైన వాగ్ధోరణిని చూచి గొప్ప గొప్ప పండితులంతా ఆశ్చర్యపడే వారట. వీరు శోభనాద్రీశవైభవం, భగవద్రామానుజ దివ్యావతారోత్సవ వర్ణనచంపూ కావ్యమ్, దివ్యదేశవైభవప్రకాశికా, విష్ణుచిత్త విజయమ్, పీఠికాపుర విజయమ్, "విష్ణుశేషీ" శ్లోకవ్యాఖ్యానమ్- మొదలైన పలు గ్రంథాలను రచించారు. వీరి పలు వ్యాసాలు అపుడు పెంటపాడునుండి వెలువడే శ్రీవైష్ణవపత్రికలో ముద్రింప బడి పాఠకులను అలరించాయి. వీరివద్ద భగవద్విషయ, శ్రీభాష్యాదిగ్రంథాలను అధ్యయనం చేసిన పలువురు పండితులు తరువాతి కాలంలో సుప్రసిద్ధ విద్వాంసులుగా పేరు పొందారు. వారిలో **ఉభయ వేదాంత మహావిద్వాన్ ఈయుణ్ణి శేషశింగరాచార్య స్వామివారు (జామాత), ఉభయ వేదాంత మహావిద్వాన్ కిడాంబి వేంకటనర సింహాచార్య స్వామివారు (జ్యేష్ఠపుత్రులు)** పేర్కొనదగినవారు. శ్రీమాన్ గోపాలకృష్ణ మాచార్యస్వామివారి పౌత్రులు ఉ.వే. శ్రీమాన్ కిడాంబి శ్రీనివాస రామానుజాచార్య స్వామివారు (నెల్లూరు), ఉ.వే. శ్రీమాన్ కిడాంబి వేంకటాచార్య స్వామివారు (నరసాపురం), దౌహిత్రులు ఉ.వే. శ్రీమాన్ ఈయుణ్ణి రంగాచార్య స్వామివారు (అంతర్వేదిపాలెం) ఇటీవలి కాలంలో సుప్రసిద్ధ ఉభయవేదాంత విద్వాంసులుగా, శ్రీవైష్ణవసంప్రదాయప్రచారకులుగా పేరు పొందారు.

ఘటాంబుకులకూటస్థో యతిశేఖరపాచకః ।
జయతాత్ జయతాన్నిత్యం ప్రణతార్తిహరో గురుః ॥